# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

13 | హైదరాబాద్, సోమవారం 29 జనవరి 2024 | HYDERABAD




కూకట్‌పల్లిలో సోమవారం ప్రారంభించనున్న మాధవరం సుశీలమ్మ మెమోరియల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

## అమ్మమ్మ జ్ఞాపకార్థం..

### ఎమ్మెల్సీ సొంత నిధులతో ప్రభుత్వ పాఠశాల నిర్మాణం

### నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, డీఈవో

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 28 : కేసీఆర్ ప్రభుత్వం మన ఊరు- మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సదుపాయాలు కల్పించింది. అయితే ప్రభుత్వమే అన్ని సర్కారు పాఠశాలలను అభివృద్ధి చేయాలంటే ఆలస్యమవుతుందని పేద విద్యార్థుల కోసం ఏదైనా చేయాలన్న సంకల్పంతో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాలను పునరుద్ధరించేందుకు ముందుకు వచ్చారు ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్‌కుమార్. తాను పుట్టి పెరిగిన ఊరికి, సమాజంలోని పేద విద్యార్థులకు తనవంతుగా ఏదైనా సహాయం చేయాలని సంకల్పించారు. తాత మాధవరం రాంచందర్‌రావు, అమ్మమ్మ సుశీల జ్ఞాపకార్థం తన సొంత నిధులతో ప్రభుత్వ పాఠశాల భవనాలను నిర్మించే పనులకు అంకురార్పణ చేశారు. మొదట బాలానగర్ డివిజన్‌లోని రాజీవ్‌గాంధీ నగర్‌లో రేకుల షెడ్‌లో కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలను తాత మాధవరం రాంచందర్‌రావు జ్ఞాపకార్థం, రూ. 90 లక్షలు వెచ్చించి 294 చదరపు అడుగుల విస్తీర్ణంలో (జీ ప్లస్ టూ) ప్రభుత్వ పాఠశాల భవనాన్ని నిర్మించారు. ఈ పాఠశాలలో 210 మంది విద్యార్థులు సంతోషంగా విద్యనభ్యసిస్తున్నారు.

### సకల వసతులు కల్పించి..

కూకట్‌పల్లిలో శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో 3 గదుల్లో 160 మంది విద్యార్థులు చదువుతున్నారు. సరైన వసతులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడేవారు. పాఠశాల దుస్థితిని గమనించిన ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ అమ్మమ్మ మాధవరం సుశీలమ్మ జ్ఞాపకార్థం పాఠశాల భవనాన్ని పునరుద్ధరించేందుకు ముందుకొచ్చారు. ఆరు నెలల కిందట పాఠశాల భవనం పునర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. 90 లక్షల రూపాయలు వెచ్చించి సకల వసతులతో కూడిన జీ ప్లస్ 2 పాఠశాల భవనాన్ని నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో కిచెన్ షెడ్, పై రెండు అంతస్తుల్లో ఐదు తరగతి గదులు, ఆఫీస్ రూమ్, లైబ్రరీ, డిజిటల్ క్లాస్ రూమ్‌లు ఉండేలా నిర్మించారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు కావాల్సిన బెంచీలు, కుర్చీలు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, మరుగుదొడ్లను కూడా నిర్మించారు. పనులు పూర్తి కావడంతో సోమవారం పాఠశాలను ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, ఎమ్మెల్యే కృష్ణారావు, జిల్లా విద్యాధికారి విజయకుమారి ప్రారంభించనున్నారు.

### జీవో 59 క్రమబద్ధీకరణ స్థలాలపై తాత్కాలిక ఆంక్షలు

సిటీబ్యూరో,జనవరి28(నమస్తే తెలంగాణ): జీవో 59 కింద క్రమబద్ధీకరణ పొందిన స్థలాల్లో భవన నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. 2023 ఆగస్ట్ 17 నుంచి జారీ అయిన జీవో-59 పట్టాలలో లే అవుట్‌లతో ఎలాంటి నిర్మాణాలకు అనుమతి ఇవ్వొద్దని సీసీఎల్‌ఏ ఆదేశించిన నేపథ్యంలో కమిషనర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు తాత్కాలికంగా అనుమతులు నిలిపివేయాలన్నారు.

### స్వల్పంగా తగ్గిన ఉష్ణోగ్రతలు..

జూబ్లీహిల్స్: గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. నగరంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 29.8, కనిష్ఠం 17.0 డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 26 శాతంగా నమోదైనట్లు వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.



### ఆర్టీఏలో మరో ఆన్‌లైన్ సేవ

- తప్పిన హైపోథెకేషన్ ఇబ్బందులు
- విజయవంతంగా వెయ్యి ఆర్‌సీలు జారీ
- ఇప్పటికే టీ యాప్ ఫోలియోలో 18 సేవలు



## ఒక్క క్లిక్‌తో ఇంటికే ఆర్‌సీ



సిటీబ్యూరో, జనవరి 28 ( నమస్తే తెలంగాణ ) : రవాణాశాఖలో ఆన్‌లైన్ సేవలకు పెద్దపీట వేస్తున్నారు. కార్యాలయాలకు రాకుండానే కేవలం ఒక్క క్లిక్‌తో సేవలు అందించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే 18 ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉండగా, ఇవి విజయవంతంగా కొనసాగుతున్నాయి. వీటి సరసన ఇప్పుడు మరో ఆన్‌లైన్ సేవ అందుబాటులోకి వచ్చింది. అదే హైపోథెకేషన్ పూర్తయ్యాక కొత్త ఆర్‌సీ పొందడం. ఈ ప్రక్రియ గతేడాది జూన్‌లో మొదలైంది. బ్యాంకులతో ఆర్టీఏ అధికారులు విస్తృతంగా చర్చలు జరిపి ఈ సేవలను తీసుకొచ్చారు. సాధారణంగా వాహనదారుడు తన బ్యాంకు రుణం పూర్తయ్యాక బ్యాంకు జారీ చేసే ఎన్‌వోసీతో కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. ఇక మీదట అలా వెళ్లకుండానే ఆర్‌సీ జారీ చేసేలా అధికారులు సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. దీని ప్రకారం బ్యాంకుల నుంచి సదరు వాహనదారుడి రుణం పూర్తయిందని ఆర్టీఏకు సమాచారం ఆటోమెటిక్‌గా వచ్చేస్తుంది. ఆ సమాచారం రాగానే సదరు వాహనదారుడి మొబైల్ నంబర్‌కు ఆర్టీఏ నుంచి ఆటో మెటిక్‌గా ఓ లింక్ చేరుతుంది. అది ఓపెన్ చేసి సాధారణ ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లిస్తే సరిపోతుంది. వాహనాలను బట్టి ఫీజు ఉంటుంది. ఏ రోజు ఆర్‌సీ మీ ఇంటికి వస్తుందో కూడా సమాచారం తెలుస్తుంది. ఈ ప్రక్రియలో మన వాహనానికి సంబంధించిన ఇన్సూరెన్స్, పొల్యూషన్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు చెల్లుబాటులో ఉండాలి. ఏవైనా గడువు ముగిసి ఉంటే ఆ లింక్‌లోనే హెచ్చరిస్తుంది. ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్లు కూడా రెన్యువల్ చేసుకుని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

#### వెయ్యి ఆర్‌సీలు జారీ

ఇప్పటికే ఆర్టీఏ అధికారులు కొత్త ప్రక్రియ ద్వారా 1157 ఆర్‌సీలు జారీ చేశారు. వాహనదారులు కార్యాలయాలకు రాకుండానే ఈ సేవలను పొందారు. మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో ఈ విధానం విజయవంతంగా కొనసాగుతుండటంతో అధికారులు తెలంగాణలోనూ ప్రారంభించారు.

#### కావాల్సిన సర్వీసుల కోసం..


స్మార్ట్‌ఫోన్‌లోని ప్లేస్టోర్ నుంచి టీ యాప్ ఫోలియోను డౌన్‌లోడ్ చేసుకుంటే సరిపోతుంది. అందులో ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్-ఆర్‌టీఏ పై క్లిక్ చేస్తే కావాల్సిన సర్వీసులు ప్రత్యక్షమవుతాయి.

### పారదర్శకమైన సేవలు..



వాహనదారులకు పారదర్శకమైన సేవలు అందించడమే మా లక్ష్యం. బ్యాంకు రుణాలపై వాహనాలు కొనుగోలు చేసిన వారు రుణ ప్రక్రియ పూర్తయ్యాక ఆర్‌సీ కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాంటి ఇబ్బందులు లేకుండా నేరుగా ఆర్టీఏ నుంచి వారి మొబైల్‌కు లింక్ చేరుతుంది. ఆ లింక్‌ను ఓపెన్ చేసి వివరాలు అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది. పోస్టులో ఆర్‌సీ ఇంటికి చేరుతుంది. ఇప్పటికే టీ యాప్ ఫోలియోతో వాహనదారులు కార్యాలయానికి రాకుండానే సేవలు పొందుతున్నారు.

– రమేశ్, జేటీసీ, హైదరాబాద్



### గుండె గూటిలో నిండు ప్రేమ

ప్రేమ చాలా పవిత్రమైంది. ఆ ప్రేమ మనుషుల్లోనే కాదు.. ప్రతి జీవరాశిలోనూ కనిపిస్తుంది. కాకపోతే.. ఆ భావ వ్యక్తీకరణ విధానం ఒక్కో వాటిలో ఒక్కో విధంగా ఉంటుంది. చిత్రంలో జంట పక్షులు తమ అందమైన ప్రేమకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ అపురూప దృశ్యం జూ పార్కులో ఆదివారం కెమెరా కంటికి చిక్కింది.

### ఒక్కరోజే.. కోటిన్నర..

సిటీబ్యూరో: సైబర్‌నేరస్తుల ఆగడాలు ఆగడం లేదు. దేశవ్యాప్తంగా ఒకే రోజు.. మాయమాటలు చెప్పి.. బాధితుల నుంచి ఏకంగా రూ. 1.5 కోట్లను డిపాజిట్ చేయించుకున్నారు చైనా సైబర్ నేరగాళ్లు. ఖాతాలు అందిస్తున్న ఇక్కడి సైబర్‌నేరగాడికి కమీషన్ వదిలేసి.. మిగతాది డ్రా చేసుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. జాయింట్ సీపీ రంగనాథ్ కథనం ప్రకారం... ఏపీకి చెందిన శిరీష్‌కుమార్ చైనా సైబర్‌చీటర్స్‌తో సంబంధాలు పెట్టుకున్నాడు. దేశ వ్యాప్తంగా పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో సందేశాలు పంపిస్తూ, స్పందించిన వారికి టాస్క్‌ల పేరుతో పనులు ఇస్తామంటూ చైనా సైబర్‌నేరగాళ్లు నమ్మిస్తున్నారు. బాధితులకు వందల్లో ఆశ చూపుతూ.. టాస్క్‌ల కోసం లక్షలు వసూలు చేస్తున్నారు. ఆ సొమ్మును బ్యాంకు ఖాతాల్లో బాధితులు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఈ అకౌంట్లను శిరీష్‌కుమార్ అందిస్తున్నాడు. ఇదిలా ఉండగా లోయర్ ట్యాంక్ బండ్ ప్రాంతంలో ఉండే ఓ వ్యక్తికి టాస్క్‌ల పేరుతో ఆశ చూపి, రూ. 60 లక్షలు దోచేశారు. బాధితుడి ఫిర్యాదుతో సీసీఎస్ సైబర్‌క్రైమ్ బృందం..దర్యాప్తు జరిపింది. బాధితులు డిపాజిట్ చేసిన బ్యాంకు ఖాతాలను ఆరా తీయడంతో అది తిరుపతికి చెందిన శిరీష్‌కుమార్‌దిగా తేలింది. దీంతో అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.



### ఉత్సాహంగా దుర్గం రన్

ఆదివారం ఇనార్బిట్ దుర్గం చెరువు రన్ (ఐడీసీఆర్) -2024 ఉత్సాహంగా సాగింది. దివ్యాంగులు, ఎల్‌జీబీటీక్యూప్లస్ కమ్యూనిటీకి చెందిన వ్యక్తులు చురుకుగా పాల్గొన్నారు. అంతకుముందు ఈ రన్‌ను మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ జీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. రన్‌లో భాగంగా రూ. 60 లక్షల విరాళాలను సేకరించామని, వాటిని పీడబ్ల్యూడీ, ఎల్‌జీబీటీక్యూ, మహిళల ఆర్థిక సాధికారత కోసం వినియోగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

- కొండాపూర్, జనవరి 28

### రేషన్ బినామీలపై నజర్

- మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా అధికారుల తనిఖీలు

మేడ్చల్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా రేషన్ దుకాణాల్లో తనిఖీలు చేస్తూ.. బినామీ డీలర్లను గుర్తించే పనిలో నిమగ్నమైంది పౌర సరఫరాల శాఖ. ఈ నెల 31 వరకు ఈ ప్రక్రియ చేపట్టి.. బినామీ డీలర్లను ఎరివేయనున్నారు. మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో 619 రేషన్ దుకాణాలు ఉంటే.. ఆహార భద్రతా కార్డులు 506163, అంత్యోదయ ఆహార భద్రతా కార్డులు 17676, అన్నపూర్ణ ఆహార భద్రతా కార్డులు 99 ఉన్నాయి. ప్రతి నెలా వివిధ కార్డులకు 10640.052 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తుండగా, గోధుమలు 2023.432 మెట్రిక్ టన్నులు, చక్కెర 17.676 మెట్రిక్ టన్నులను, నిత్యావసర వస్తువులను ప్రజలకు రేషన్ షాపుల ద్వారా అందిస్తున్నారు. అయితే రేషన్ దుకాణాలపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు.. బినామీ డీలర్ల అంశంపై ఉన్నతాధికారులకు నివేదికను సమర్పించనున్నారు. వీటి ఆధారంగా తగిన చర్యలు తీసుకోనున్నారు. ప్రజలకు నిత్యావసర వస్తువులు సక్రమంగా అందాలనే బినామీ డీలర్లను ఎరివేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.





### కేరింతలు కొడుతూ.. ఉత్సాహపరుస్తూ..

ఉప్పల్ వేదికగా జరిగిన మొదటి టెస్టులో భారత్‌పై ఇంగ్లాండ్ 28 పరుగుల తేడాతో విజయం సాధించింది. కాగా, మ్యాచ్‌ను చూసేందుకు భారీగా క్రీడాభిమానులు తరలిరావడంతో స్టేడియంలో సందడి నెలకొంది. మ్యాచ్‌ను వీక్షిస్తున్నంత సేపు ప్రేక్షకులు కేరింతలు కొడుతూ.. వివిధ సందేశాలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ..తమ అభిమాన క్రీడాకారులను ఉత్సాహపరిచారు.







### చీరకట్టు.. కళ్లు చెదిరేట్టు



నగరంలో ఆదివారం ధమాకా మూవీ ఫేం వేదిక సోని సందడి చేసింది. ఓ కార్యక్రమానికి హాజరైన ఈ ముద్దుగుమ్మ.. చీరకట్టు సోయగాలతో హొయలొలుకుతూ.. ఫొటోలకు ఫోజులిచ్చింది.

- సిటీబ్యూరో, జనవరి 28 (నమస్తే తెలంగాణ)